క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏటీడీఓ

కొణిజర్ల: మండలంలోని బస్వాపురం గ్రామంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఖమ్మం ఏటీడీఓ బి.సత్యావతి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులు, డార్మెటరీ, వంట షెడ్డు, కంప్యూటర్ ల్యాబ్, సిక్‌రూమ్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు యూనీఫాం పంపిణీ చేశారు. బాలురితో కలిసి భోజనం చేసి భోజనం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సోమ్లా, ఉపాధ్యాయులు అరుణ, కృష్ణారావు, సక్రామ్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఏన్కూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షసప్తమ్ వారోత్సవాల్లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కూరాకుల సైదయ్య పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

తల్లాడ: తల్లాడలో నెల క్రితం పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితుడికి బుధవారం ఎస్‌ఐ కొండల్‌రావు అప్పగించారు. తల్లాడ గోపాల మిత్ర డి.వెంకటేశ్వర్లు బైక్‌పై వెళ్తుండగా ఫోన్ జారి పడింది. దీంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆచూకీ గుర్తించిన పోలీసులు ఆయనకు అందజేశారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం



బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లి: మున్సిపాలిటీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ జేఏఓ స్వప్న, బిల్‌కలెక్టర్లు ఎం.శ్రీను, అవినాష్ బదిలీపై వెళ్తుండగా వీరిని బుధవారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగుల సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, మేనేజర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు అనీల్, విజయ నిర్మల, శ్రీను, అబ్దుల్లా, కృష్ణారావు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఏన్కూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల పంచాయతీ అధికారి జి.వెంకట సత్యనారాయణ కోరారు. మండలంలోని నాచారంలో పంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది దుర్గాప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వారాహిదేవిగా వాసవీ మాత

మధిర: ఆషాడ మాసం సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం వాసవీ మాతను వారాహిదేవిగా అలంకరించారు. టీ సందర్భంగా అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇంటిగోడ



కూలిపోయిన ఇంటి వద్ద బాధితురాలు నాగలక్ష్మి

సత్తుపల్లిరూరల్: గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి గోడలు నాని కూలిపోయిన సంఘటన మండల పరిధిలోని సిద్ధారంలో బుధవారం చోటు చేసుకుంది. సిద్ధారం గ్రామానికి చెందిన రావూరి సీతారాములు, నాగలక్ష్మి దంపతులు మట్టి గోడలతో నిర్మించిన ఇంట్లో చాలా కాలంగా నివాసం ఉంటున్నారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో గోడలు నాని కూలిపోవటంతో ఆ కుటుంబం దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పునరావాసానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆకతాయిల ఆగడాలు

- గంజాయి మత్తులో నిత్యం ఘర్షణలు
- పోకిరీలకు అడ్డాగా మారిన బస్టాండ్
- పోలీస్ గస్తీ లేక ఇష్టారాజ్యం

సత్తుపల్లిటౌన్: యువతులు, విద్యార్థినులు, బాలికలు, మహిళలకు నిత్యం పోకిరీల వేధింపులకు సత్తుపల్లి బస్టాండ్ అడ్డాగా మారింది. గంజాయి మత్తులో విద్యార్థులు, యువకులు ఘర్షణలకు పాల్పడుతున్న సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఆకతాయిల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని విద్యార్థినులు వాపోతున్నారు.

సాయంత్రమైతే చాలు..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సాయంత్రమైతే నిత్యం వేలాది మందితో ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడుతుంది. బస్‌పాస్‌లతో విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో సాయంత్రానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు బస్టాండ్‌కు చేరతారు. ఈ సమయంలోనే విద్యార్థినులు, యువతులను ఈవ్‌టీజింగ్ చేస్తూ పోకిరీలు ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించటం.. కామెంట్లు చేస్తుండటంతో విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ఏవరైన ప్రశ్నిస్తే గొడవలకు దిగుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.



విద్యార్థులతో రద్దీగా ఉన్న సత్తుపల్లి బస్టాండ్

పోలీస్ అవుట్‌పోస్ట్ లేకపోవటంతో..

బస్టాండ్‌లో ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు గతంలో బస్టాండ్‌లో ఉండే పోలీస్ అవుట్‌పోస్టు లేకపోవటంతో వీరి ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. పోలీస్ పర్యవేక్షణ కూడా లేకపోవటంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం ఘర్షణలు గంజాయి మత్తులోనే చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల మధ్య మాటమాటా పెరిగి పరస్పరం తోపులాటలకు దిగుతుండటంతో ఆర్టీసీ ఉద్యోగులకు వారిని వారించటం తలకుమించిన భారంగా పరిణమిస్తోంది.

బస్సుల్లోనూ వదలని ఆకతాయిలు..

బస్సుల్లోనూ బాలికలు, విద్యార్థినులతో పాటు మహిళా కండక్టర్ల భద్రత ఆగమ్యగోచరంగా మారింది. కిక్కిరిసిన బస్సుల్లోకి ఎక్కిన ఆకతాయిలు వీరిపట్ల వెటకారంగా.. డబుల్‌మీనింగ్ వచ్చేలా కామెంట్లు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. గుంపులుగా సెల్‌ఫోన్‌తో పాటలు పెద్దగా పెట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పోలీస్ అధికారులు బస్టాండ్‌లో ఆకతాయిల ఆగడాలను ఆరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, ప్రయాణికులు కోరుతున్నారు.



ఘర్షణ పడుతున్న విద్యార్థులు

పెట్రోలింగ్ నిర్వహిస్తాం..



సత్తుపల్లి బస్టాండ్ ప్రాంగణంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తాం. ఉదయం, సాయంత్రం సమయాల్లో విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో గస్తీ పెంచుతాం. ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.

– టి.కిరణ్, సీఐ, సత్తుపల్లి

అన్నం పెట్టే రైతన్నకు అన్యాయం



వైరాలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

వైరా/మధిర/పెనుబల్లి: ప్రజలకు అన్నం పెట్టే రైతన్నకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సున్నం పెట్టిందని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ సాగు రైతు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఖమ్మం జిల్లా రైతు సేవా కోఆర్డినేటర్ కుదుముల వెంకట్రామిరెడ్డి, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్య.కా.సా రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ఇచ్చిన కేటాయింపులపై వారు విచారం వ్యక్తం చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వైరా, మధిర, పెనుబల్లిలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేంద్రం మరో మారు రైతులను మోసం చేసిందని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకున్నదని తక్షణమే బడ్జెట్ సవరించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు పరచడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. తెలంగాణ విభజన హామీ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. 8 మంది బీజేపీ పార్లమెంట్ సభ్యులు ఉండి, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా తెలంగాణకు మొండి చెయ్యి దక్కిందన్నారు. పార్లమెంట్ సభ్యులు తక్షణమే కేంద్రంపై ఒత్తిడి చేసి నిధులు మంజూరుకు కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులను ఆర్థిక నష్టాల నుంచి కాపాడేందుకు రైతు భరోసా, రుణమాఫీ, రైతులు వాడే యాంత్రీకరణ పరికరాలను ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రావడం శుభ పరిణామమని తెలిపారు. తిండిగింజలు కావాలంటే భూమిని దున్ని, విత్తనం విత్తి, నారు పెంచి, నీరు పెట్టి, భూమి నుంచి పంటను తీయాలి తప్ప ఏ పరిశ్రమ ద్వారా తిండి గింజలు తయారు చేయలేరని స్పష్టం చేశారు. ఇప్పటికే కొందరు రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు, తెగుళ్ల ఆశించి పంటలు దెబ్బతిన్న రైతులు లక్షలాది రూపాయలు ఆర్థికంగా నష్టపోయి వ్యవసాయం చేయడం మానేస్తున్నారని వాపోయారు. ప్రజలకు అన్నం పెట్టే రైతులను గుర్తించకపోతే భారతదేశం మరో శ్రీలంకగా మారక తప్పదన్నారు. కేంద్ర బడ్జెట్‌ను నిరశిస్తూ బుధవారం వైరాలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరశన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామారావు, నాగేశ్వరరావు, సుధాకర్, నరసింహారావు, శ్రీనివాసరావు, నరసింహాచారి, రమణ, గాయం తిరుపతిరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ట్రాన్స్‌జెండర్ల సమస్యలు

సత్తుపల్లి: సమాజంలో ట్రాన్స్ జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. పట్టణంలోని వెంగళరావునగర్‌లో ట్రాన్స్‌జెండర్స్ మేరీ మాలకమ్మ ఆధ్వర్యాన ముర్రిగిమాత మహోత్సవం పూజల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగుల్‌మీరా, ఎండీ కమల్‌పాషా, సీలార్, అజయ్, భరత్ పాల్గొన్నారు.

పొలాలకు రహదారి ఏర్పాటు చేయండి..

పెనుబల్లి: మా పొలాలకు వెళ్లడానికి రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలంటూ.. కుప్పెనకుంట్ల, గుట్టపాడు రైతులు బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా రైతులు.. గుట్టపాడు నుంచి ముగ్గువెంకటాపురం వెళ్లడానికి ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు బురదమయంగా ఉండడంతో మేమంతా బైక్‌పైగానీ, కనీసం నడచి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయమై గతంలో ఎమ్మెల్యే రాగమయికి తెలుపడంతో మట్టా దయానంద్ రైతులతో కలిసి ట్రాక్టర్‌పై వెళ్లి రోడ్డును పరిశీలించి.. ఎమ్మెల్యేతో మాట్లాడి తారు రోడ్డు నిర్మించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, మాధవరావు తదితరులు ఉన్నారు.



పెనుబల్లి: రహదారిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు దయానంద్, గ్రామస్తులు

ఆర్థిక సాయం



నరసింహారావుకు నగదు అందిస్తున్న యువభారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన ఆది నరసింహారావు కుమార్తె ఆదిగుణతన్విక(4) అరుదైన కవసాకే అనే వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న యువభారత్ శక్తిఫౌండేషన్.. అందరి సహాయ సహకారాలతో సోషల్ మీడియా ద్వారా రూ.1,20,00ఫండింగ్ చేశారు. ఈ నగదును ఆ ఫౌండేషన్ నిర్వాహకురాలు కామెర్ల కాంత్రి ఆధ్వర్యంలో సభ్యులు చిన్నారి కుటుంబానికి బుధవారం అందించారు. ఈ సందర్భంగా నరసింహారావు ఆర్థిక సాయం చేసిన ఫౌండేషన్ సభ్యులను, ఆదుకున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

కుట్టుమిషన్ వితరణ

వైరా: వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ సభ్యుడు సీహెచ్ మురళీ సతీమణి జ్యోతి జన్మదినాన్ని పురస్కరించుకుని వైరా బ్రాహ్మణపల్లికి చెందిన నిరుపేద మహిళ షేక్ మస్తాన్‌బీకి కుట్టుమిషన్ వితరణగా అందజేశారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ చేతుల మీదుగా మహిళకు అందజేశారు. గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్, కిషన్‌రాయ్, పుల్లారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు..

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడులోని పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన వేమిరెడ్డి కోటారెడ్డి భోజనం ప్లేట్లు వితరణ చేశారు. వీటిని మాజీ సర్పంచ్‌లు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండారు నర్సింహారావులు.. దాత కోటారెడ్డితో కలిసి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, శివారెడ్డి, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

మధిర/వేంసూరు: పీఆర్‌టీయూ సంఘ కృషితోనే ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగ అభివద్ధి సాధ్యమవుతుందని ఆ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, పీఆర్‌టీయూ రాష్ట్ర సీనియర్ నాయకులు, సంఘ మాస పత్రిక ఎడిటర్ చిత్తులూరి ప్రసాద్ తెలిపారు. బుధవారం చిలుకూరు, ఖమ్మంపాడు, దెందుకూరు, ఇల్లూరు, మహదేవపురం, మడుపల్లి పాఠశాలలతో పాటుగా.. పెనుబల్లి మండలంలోని అడసర్లపాడు ఉన్నత పాఠశాల, లింగపాలెం, ఎర్రగుంటపాడు పాఠశాలల్లో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేకుండా కేవలం ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగ అభివృద్ధే లక్ష్యంగా గత ఐదు దశాబ్దాలుగా పీఆర్‌టీయూ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు రవికుమార్, కృష్ణ, ప్రధాన కార్యదర్శులు కిరణ్ కుమార్, లక్ష్మణాచారిజిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మధిర: మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

సత్తుపల్లిరూరల్: ఎన్నికల వరకే రాజకీయాలని ఆ తర్వాత రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేశామని సత్తుపల్లి ఎంపీపీ దొడ్డా హైమావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని శాఖల సమన్వంతో గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాయన్నారు. ప్రజలందరీ సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాసరి వెంకట్రామిరెడ్డి(చిట్టినాయన), తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ ఆర్‌సీహెచ్ నాగేశ్వరరావు, ఎంపీఓ కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కల్లూరురూరల్: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా విష జ్వరాలు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. దోమలు ప్రభలకుండా ఫాగింగ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సురేష్‌బాబు, ఈజీఎస్ ఏపీఓ హేమమాలిని పాల్గొన్నారు.

31న ఛలో అసెంబ్లీ కార్యక్రమం

సత్తుపల్లిరూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 31 చేపట్టే ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకుడు నిమ్మటూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రామారావు, బస్వయ్య, లక్ష్మి, పార్వతి, సక్కుబాయి, సీతమ్మ, వెంకమ్మ, సుశీల పాల్గొన్నారు.

బస్సు వేళలు మార్చాలి

వైరారూరల్: ఖమ్మం నుంచి నెమలి వెళ్లే బస్ రూట్ సమయాలను మార్చాలని కోరుతూ మండలంలోని దాచాపురం, గరికపాడు గ్రామాల ఎంపీటీసీ సభ్యురాలు మాగంటి సుందరమ్మ ఖమ్మం ఆర్టీసీ ఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం బస్సు వేళలు ఉదయం 6.30 గంటలకు సాయంత్రం 4.00 గంటలకు తిప్పుతుండడం వలన విద్యార్థులకు ఇక్కట్లకు గురవుతున్నట్లు వివరించారు. ఉదయం 7 గంటలకు ఖమ్మం నుంచి నెమలికి అలాగే సాయంత్రం 4.15 గంటలకు నెమలి నుంచి ఖమ్మానికి బస్సు రూట్ సమయాలను మార్చాలని వినతిలో వివరించారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: పాక్షిక పక్షవాతం, శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలో దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ వైద్యసేవలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ సేవలతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందని, అవసరమైన వారికి సహాయ పరికరాలను అందజేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేవీఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు లలితకుమారి పాల్గొన్నారు.

స్వీయ నియంత్రణతోనే ప్రమాదాల నివారణ

మధిర/సత్తుపల్లిటౌన్: వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఖమ్మం ఆర్టీసీ ఆర్‌ఎం సరిరామ్, మధిర పోలీస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మధు, సత్తుపల్లి ఎంవీఐ జె.యోగేశ్వర్‌సింగ్ జాదవ్ తెలిపారు. బుధవారం మధిర డిపోలో డిపో మేనేజర్ శంకర్‌రావు అధ్యక్షతన, సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రమాదరహిత వారోత్సవాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాలు ఎక్కువగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటంవలనే జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లు అందరూ తమ తమ విధులకు హాజరయ్యే క్రమంలో పూర్తి ఏకాగ్రతతో హాజరై డ్రైవింగ్ చేయాలని సూచించారు. మద్యపానం సేవించి విధులకు హాజరు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో జీవీ రావు, జీఆర్ రెడ్డి, టీసీఎస్ రెడ్డి, ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎస్‌ఎం బాలస్వామి, వీబీఓ కిన్నెర ఆనంద్, ఏడీసీలు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మధిర: మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ సరిరామ్

రైతులు సహకరించాలి

కారేపల్లి: రైల్వే రెండో ట్రాక్ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సంపత్‌కుమార్ కోరారు. డోర్నకల్ నుంచి కొత్తగూడెం వరకు చేపట్టబోయే రైల్వేట్రాక్ రెండోలైన్ (డబ్లింగ్)కు రైల్వే అధికారులు బుధవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన, రైల్వే అధికారులు సింగరేణి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో ఎవరైతే రైతులు తమ భూమి కోల్పోతున్నారో.. వారికి మార్కెట్ విలువకు రెండింతలు నష్టపరిహారం చెల్లిస్తారని, భూనిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న రైల్వేలైన్ మధ్య నుంచి కుడివైపు భాగంలో సుమారు 24 మీటర్ల మేర భూమి కోల్పోవాల్సి వస్తుందని, మరికొన్ని చోట్ల సర్వే ఆధారంగా ఎక్కువ మీటర్లు తీసుకోవాల్సి వస్తుందని, అదే విధంగా కారేపల్లి రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా 60మీటర్ల మేర రైల్వేకు సంబంధించిన భూమి ఉందని, స్టేషన్ పరిధిలో లూప్‌లైన్‌లు ఏర్పాటు చేయాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే జేఈ లు ప్రశాంత్, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ, సర్వేయర్‌లు కిరణ్, భాషా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సంపత్‌కుమార్

మధ్యాహ్న భోజనం అందడంలేదు



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంపీఓ రంజిత్ కుమార్

వేంసూరు: తమకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందడం లేదని మర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఎంపీఓ రంజిత్ కుమార్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలుగా గుడ్డు పెట్టడం లేదని, కూరలు సైతం పాఠశాలలో వండడం లేదన్నారు. మెనూ ప్రకారం భోజనం అందడం లేదని ఎంపీఓకు తెలిపారు. ఈ విషయమై మధ్యాహ్న కార్మికులను అడుగ్గా.. తమకు రావాల్సిన బిల్లులు రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయామని తెలుపగా.. మీ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీఓ తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వేంసూరు: పాడి కరివేద పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ రామ్మోహన్ అన్నారు. బుధవారం మండలంలోని పాడి కరివేద పద్ధతిలో సాగు చేస్తున్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరుగా విత్తిన వరి పైరులో ఇనుము, జింతు ధాతు లోపాలు రావడం వలన పైరు తెల్లబడి ఎదుగుదల ఉండదని.. నివారణకు ఇనుపధాతు లోపం నివారణకు ఫెర్రస్‌సల్ఫేట్ (ఎఫ్‌ఈఎస్ఓ4)1 కేజీ, 200 నిమ్మ ఉప్పు గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. జింకుధాతు నివారణకు జింకు సల్ఫేట్ 400 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు ఓగ్గ వేమిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మురళి పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన ఎస్సై

తల్లాడ: తల్లాడలో వాటర్ ట్యాంక్‌ను బుధవారం ఎస్సై కొండల్‌రావ్ ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన దగ్గుల కృష్ణవేణి జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు దగ్గుల అప్పిరెడ్డి, లక్ష్మీకుమారి.. తల్లాడ ప్రజల సౌకర్యార్థం వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దగ్గుల రఘుపతిరెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, అప్పిరెడ్డి, శివారెడ్డి, నర్సిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, అమూల్య, కాంతారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, రేగళ్ల పుల్లారెడ్డి, వజ్రాల వెంకటసుబ్బమ్మ, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి

చింతకాని: చింతకాని పీహెచ్‌సీకి ప్రత్యేక అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొండా గోపి డిమాండ్‌చేశారు. మండల పీహెచ్‌సీలో మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్‌కు బీజేపీ మండల నాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడే రోగులకు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రామారావు, సత్యనారాయణ, నాయకులు అనంత రెడ్డి, మంగయ్య, నాగాచారి, గోపి, విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

వైరారూరల్: మండలంలోని కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు తక్షణమే రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని గొల్లపూడి రైతు వేదికను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలోని 395 మంది రైతులు కొత్తగా పాస్‌పుస్తకాలు పొందారని, 18 నుంచి 59 సం॥లు వయస్సు కలిగిన రైతులు తక్షణమే తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, నామినీ ఆధార్, బ్యాంకు పాస్‌పుస్తకాల జిరాక్స్‌లను ఏఈఓలకు ఇచ్చి రైతు బీమా పథకం కోసం ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఏన్కూరు: రైతు రుణమాఫీ పథకాన్ని ఎలాంటి షరుతులు లేకుండా అమలుచేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు నల్లమోతుల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరావు, వెంకటేశ్వరరావు, కృష్ణ, దర్గయ్య, బిక్షం, లక్ష్మినర్సు, రామరావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తల్లాడ: మండలంలోని రంగంబంజర గ్రామంలో బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రంగంబంజరలో కాంగ్రెస్ నాయకులు పగడాల లచ్చిరెడ్డి, దేవరపల్లి శ్రీనివాసరావు, ధర్మశోత్ దశరద్ నాయక్ చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వడ్లమూడి మరళీకృష్ణ, తాటి అప్పారావు, దేవరపల్లి గణేష్, ఈలప్రోలు బసవయ్య, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, మడిపల్లి బాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో బుధవారం దివ్యాంగులకు అన్నదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన బొలిశెట్టి సత్యనారాయణ గుప్తా వర్ధంతి సందర్భంగా సతీమణి నాగలక్ష్మి ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సంస్థ నిర్వాహకురాలు నల్లపు స్వర్ణలత మాట్లాడుతూ.. దివ్యాంగులకు అన్నదానం చేసిన సత్యనారాయణ గుప్తా కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి వెంకట నారాయణ గుప్తా, చంద్రిక పాల్గొన్నారు.

బ్యాంక్ ఎదుట రైతుల ఆందోళన

కారేపల్లి: ఇల్లందు యూనియన్ బ్యాంక్ ఎదుట సింగరేణి మండలం పాటిమీదిగుంపు, బాజుమల్లాయిగూడెం, చీమలపాడు ప్రాంతాలకు చెందిన గిరిజన రైతులు తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాలకు చెందిన గిరిజన రైతులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇచ్చిన అటవీ హక్కు పత్రాలతో పాటు, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన పాసుపుస్తకాలను గత సంవత్సరం జూన్ నెలలో రుణాలు ఇస్తామని హక్కుపత్రాలను తీసుకున్న బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వలేదన్నారు. ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. ఈ క్రమంలోనే కొంతమంది బ్యాంక్ అధికారులు దళారులను ఏర్పాటు చేసి రైతుల నుంచి డబ్బులు వసూళ్లు చేసి మోసం చేశారని.. అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కృష్ణ, కిరణ్, ధనమ్మ, వెంకన్న, వెంకటనరసమ్మ, హేమ్లా, రాజేష్, రమేష్, పార్వతి, రాములు, ముత్తమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న పోడు రైతులు